# పిడికల



ఆంజనేయులుకు మూడురోజులుగా ఒకటే జ్వరం. మూసిన కన్ను తెరవలేదు. ఆంజనేయులు భార్య రాములమ్మ ఈ మూడు రోజులూ అతని జ్వరాన్ని గురించి పట్టించుకున్నది కాదు. రోగాలు మనుషులకు రాక మాన్లకు వస్తాయా. అదే పోతుందిలే అను కుంది. మూడురోజులున్నా జ్వరం తగ్గకపోయేసరికి ఏమవుతుందో ఏమోనని భయం పట్టుకుంది.

"ఏమయ్యోవ్, ఆస్పత్రికి పోదామా?" అంది రాములమ్మ తలదగ్గర మంచంమీద కూర్చొని.

ఆంజనేయులుకు వంటిమీద స్పృహేలేదు. ఆమె అన్న మాట అతనికి వినిపించలేదు. అందుకని ఆంజనేయులు ఉలకనూలేదు, పలకనూలేదు. రాములమ్మకు వెన్నులో వణుకు ప్రారంభమయింది. ఏంచెయ్యడానికీ తోచలేదు. కొడుకు ఇంట్లో లేడు. బయట ఎక్కడ తిరుగుతున్నాడో ఏమో. కూతురు ప్రవీణ వసా రాలో కూర్చొని చదువుకుంటోంది.

"ప్రవీణా!" అంది రాములమ్మ

చదువుతున్న పుస్తకం పక్కనపెట్టి ఇంట్లోకి వచ్చింది ఆ పిల్ల.

"మీ నాన్న పిలిస్తే పలకడంలేదే" అంది దిగాలుగా. ప్రవీణ బిక్కమొగమేసింది.

"ఊళ్లోకి వెళ్లి డాక్టరును పిలుచుకొస్తాను. నువ్వు మీ నాన్న దగ్గర కూచొని వుండమ్మా" అంది రాములమ్మ. ప్రవీణ సరేనన్నట్లు తలూపింది.

బలాదూరుగా బజార్లవెంట తిరుగుతున్న కొడుకు మీద కోపం ముంచుకొచ్చింది. చిన్నపనీ పెద్దపనీ అన్నీ తనే చేసుకోవాల. ఇంటిపట్టున వుండి తల్లికి చేదోడు వాదోడుగా వుండవచ్చుగదా. చిన్నవాడా చితకవాడా. బియ్యే చదువుతున్నాడు. ఈమాత్రం కూడా బాధ్యత లేకపోతే ఎలా అన్నది ఆమె ఆగ్రహానికి కారణం.

రాములమ్మ గడపలోకి వచ్చి బయటకు తొంగి చూసింది. ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. ఒకటొకటి చినుకులు రాలుతున్నాయి. కంటికీ మంటికీ ఏకధారగా ఏడవడానికి ఆకాశం సిద్ధంగా వున్నట్లు కనిపిందింది ఆమెకు. ఇంట్లోకి పోయి గొడుగు తీసుకొని బయటకు వచ్చింది. వర్షం కాస్త ఎక్కువైంది. గొడుగు తెరవగానే దానిమీదున్న దుమ్మూ, ధూళీ గుప్పున పైకిలేచింది. గొడుగుకు అన్నీ చిల్లులే. రివటలు కొట్టినట్లుంది. అది వర్షం నుండి తన్ను రక్షించలేదు. మళ్లీ గొడుగు మడిచి ఇంట్లో పెట్టింది. మూలనున్న గొనెపట్ట తీసి, గూడగా చేసి తలమీద వేసుకొని డాక్టరు దగ్గరకు బయలుదేరింది.

రాములమ్మ వెళ్లేసరికి డాక్టరు ఇంట్లోనే వున్నాడు. ఆ పల్లెటూర్లో వున్న ఏకైక ఆర్.ఎమ్. పి డాక్టరు అతను. పేరు సుదర్శనం.

"ఏమ్మా వర్షంలో వస్తివి?" అన్నాడు సుదర్శనం.

"మా ఆయనకు జ్వరం"

"ఎప్పట్నుంచి?"

"మూడురోజులయింది."

"మరి ముందే ఎందుకురాలేదమ్మా"

అలా అనడం డాక్టర్లకు మామూలే. సాధకబాధకాలు ఆలోచించరు. రాములమ్మ సమాధానం చెప్పలేదు.

"సరే. జ్వరం మూడురోజుల నుంచీ వస్తున్నదంటున్నావు. సెలైన్ బాటిల్స్ రెండుమూడు ఎక్కించాల్సి వుంటుంది. మందులు కూడా నావద్దలేవు. అన్నీ రాసిస్తాను. మీ అబ్బాయిని ఎవరిదన్నా టి.వి.యస్ తీసుకొని టౌనుకెళ్లి తీసుకురమ్మను. అప్పుడు వస్తాను. ఇప్పుడు వచ్చి నేను చేసేది ఏంలేదు" అన్నాడు సుదర్శనం.

నిజానికి అతని దగ్గర మందులూ వున్నవి. సెలైన్ బాటిల్సూ వున్నవి. రాములమ్మ పాతబాకీ రెండు వందల దాకా యింకా ఇవ్వవలసి వుంది. మళ్లీ ఇప్పుడు చేతిసొమ్ము పెట్టడం సుదర్శనానికి ఇష్టంలేదు.

"అట్లనేసారూ. రాయించండి" అంది రాములమ్మ.

మందుచీటీ రాసి సుదర్శనం రాములమ్మకు ఇచ్చాడు. ఆమె పరుగెత్తుతున్నట్టుగా ఇంటికి బయలుదేరింది. ఉన్నట్టుండి ఒక ఇంటిముందు ఆగి,"ఒరే పవన్!" అంటూ పిలిచింది. సాధారణంగా ఆమె కొడుకుండే ఇల్లది. ఆమె అనుకున్నట్లుగా ఆమె కొడుకు అక్కడే వున్నాడు.

అతను ఆత్రంగా బయటకు వచ్చి "వర్షంలో ఎందుకు వచ్చినావమ్మా" అన్నాడు.

"తొందరగా ఇంటికి చావు. అమ్మాయి బిక్కుబిక్కుమంటూ ఒక్కటే వుంది. నేను రావడానికి ఆలస్యం అవుతుంది." అంటూ వాడి సమాధానం కోసం ఎదురు చూడకుండానే ఒక బజారుకు ధారి తీసింది. వర్షం ఎక్కువైంది. చీర తడిసి ముద్దముద్ద అయింది. అట్లా బజార్లవెంట తిరగడం మామూలుగా అయితే ఆమెకు ఇష్టం వుండదు. కానీ ప్రస్తుతం ఆ స్పృహేలేదు. మందులకోసం డబ్బు కావాలి. ప్రస్తుతం ఆమె తలలోవున్న ఆలోచన అదొక్కటే. ఆమె వచ్చి ఆదిరెడ్డి ఇంటిముందు ఆగింది. ఆ వూళ్లో వున్న మోతుబరి రైతుల్లో అతనూ ఒకడు. కాసేపు తటపటాయించి ఇంట్లోకి అడుగుపెట్టింది. ఆదిరెడ్డి మంచంమీద కూచొని తాపీగా బీడీ తాగుతున్నాడు.

## సోదుం జయరాం

"ఏంది రాములమ్మక్కా వానలో వస్తివి" అన్నాడు.

"మీ బావకు జ్వరం నాయనా. డాక్టరు మందులు రాయించినాడు. ఆరువందలు అవుతాయన్నాడు. నీ దగ్గర వుంటుందని వచ్చినాను."

తల అడ్డంగా తిప్పి తడుముకోకుండా అన్నాడు ఆదిరెడ్డి "అమ్మో వుంటే నీకిచ్చే దానికి అడ్డమేముంది. చేతనయాపైసా లేదు"

ఆ సమాధానం వినగానే రాములమ్మకు కళ్లు బైర్లుకమ్మాయి. నోట మాట రాలేదు. కష్టం మీద నోరు తెరిచి ప్రాధేయపూర్వకంగా, "చూడు ఆదిరెడ్డీ ఆరు వందల రూపాయలకు నీ ఇనప్పెట్టె తెరవనవసరంలేదు. నీ ఇంట్లో గూళ్లలో వెతికితే ఆరువందల రూపాయలు దొరుకుతాయి. కాదనకు. నీకు పున్నెముంటుంది. ఆపదలో వున్నాను." అంది.

"మీరు అట్లనే అనుకుంటారు. నిన్న ఐదువేల రూపాయల ఫాస్పేట్ తేడానికి నానా అగచాట్లూ పడినాను. చెబితే నమ్ము రాములమ్మక్కా" అన్నాడు.

ఇక రాములమ్మకు అక్కడ ఒక్కక్షణం వుండబుద్ధికాలేదు. బోణీ అలా అయింది. మరొకర్నీ మరొకర్నీ అడగటానికి ఆమె మనస్కరించలేదు. వర్షంలో తడుసుకుంటూ ఇంటికొచ్చి ఇంట్లో కుసుళ్లన కూలబడిపోయింది. ఆమెకు కంఠ దగ్గంగా శోకం ముంచుకొచ్చింది. మోకాళ్లసందున తల ఆనించి వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

"నీకు పిచ్చా వెర్రా ఎందుకేడుస్తావ్" అన్నాడు పవన్.

"మీ నాన్న మందులకోసం డబ్బు దొరకలేదు. ఏం చెయ్యాలిరా యిప్పుడు" అంది.

"ఎంత?"

"ఆరువందల దాకా అవుతుందన్నాడు డాక్టరు"

"దానికోసం ఏడుస్తావా"

"మీ నాయనకేమౌతుందోనని భయంగా వుందిరా"

"ఏమీకాదు. మూడురోజుల జ్వరం వస్తానే ఏమౌతుందే. ముందు ఆ తడిసిన చీరా రవికా మార్చుకో. అట్లానే వుంటే జలుబుచేస్తుంది. నేను ఇప్పుడే బయటకు వెళ్లి ఐదు నిమిషాల్లో వస్తాను" అన్నాడు పవన్.

"ఎక్కడికిరా"

వాడు సమాధానం చెప్పలేదు. ఇంట్లోనుంచి బయలుదేరి నేరుగా శీను ఇంటి దగ్గరకు వచ్చాడు. శీను పవన్ క్లాసు మేటు.

"ఒరే శీనూ నీ టి.వి.యస్ యివ్వు. అలాగే గొడుగు కూడా"

"తీసుకుపో. కానీ ఈ వానలో ఎక్కడికిరా"

పవన్ విషయం చెప్పాడు. "నన్ను కూడా తోడురమ్మంటావా" అన్నాడు శీను.

తడుస్తూ నువ్వెందుకురా" అంటూ టివియస్ తీసుకొని ఇంటిముఖం పట్టాడు పవన్.

టి.వి.యస్ ఇంటిముందు ఆపి, "అమ్మా" అంటూ కేకపెట్టాడు.

రాములమ్మ బయటకు వచ్చింది.

తొందరగా ఆ మందుచీటీ ఇలా యివ్వమ్మా. మందులు తెస్తాను." అన్నాడు పవన్. రాములమ్మకు కొండం




త ధైర్యంవచ్చింది. ఆదరాబాదరా లోపలికి వెళ్లి మందుల చీటీ తెచ్చి కొడుకు చేతిలో పెట్టి, "డబ్బెక్కడిదిరా" అంది.

"మందులషాపులో నాకు అప్పు దొరుకుతుంది. నువ్వు నిబ్బరంగా వుండు. ఒక గంటలో వస్తాను" అన్నాడు పవన్.

పవన్‌ను అక్కున చేర్చుకొని ముద్దాడాలనిపించింది రాములమ్మకు. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు. అట్లాంటి స్థితిలో కొడుకును పంపుతున్నందుకు భయంగా కూడా వుంది.

"భద్రం నాయనా! వర్షం వస్తున్నది. జాగర్తగా పోయిరా తండ్రీ" అంది.

కొడుకు అటు వెళ్లగానే తలమీద నుంచి ఏదో బరువు దించుకున్నట్లయి ఒక నిట్టూర్పు విడిచింది.

రాములమ్మ ఇంట్లోకి వచ్చి భర్త మంచంకోడు మీద తలమోపి పక్కనే కూలబడిపోయింది. భర్తరోగంతో వున్నప్పుడు కూడా ఆరువందల రూపాయలు చేబదులు పుట్టలేదు. ఇలాటి అనుభవాలు ఆమెకు చాలానే వున్నాయి. ఇరుగూ పొరుగూ పావుబియ్యం బదులడిగితే నిర్దాక్షిణ్యంగా యివ్వకపోయిన దినాలున్నాయి. ఇవ్వాల్టి సంఘటన పుండుమీద కారం చల్లినట్లయి మనసును అమితంగా సలుపుతున్నది. లోలోపల కుమిలికుమిలి ఏడ్చింది. మనుషులు యింత స్వార్థపరులుగా మారడానికి మూలకారణమెక్కడుందో ఆమెకు అర్థంకాలేదు. తమకు కడంతకాలం కష్టాలనే తప్ప సుఖాల్ని యివ్వని ఆ భగవంతుని మీద కూడా కోపం వచ్చింది. తన భర్తజూదరి కాదు. తాగుబోతు కాదు. వూలోల్ల సొమ్ముకు ఒక్క పొద్దుండేరకంకాదు. తనకున్న ఆరు ఎకరాల్లో కష్టించి పనిచేస్తూనే వున్నాడు. అరకపట్టి దున్నడం వల్ల తన మొగుని చేతిలో అదృష్టరేఖలు అరిగిపోయాయేమో అనిపించింది.

ఆంజనేయులుకు బయటి ప్రపంచంతో సంబంధంలేదు. కోమాలోకి జారుకున్నాడు. ఒకటికాదు. రెండురోజులు అలా కోమాలోనే వున్నాడు. ఆ కోమాలో ఎన్నెన్నో కలలు. చివరిరోజున యమభటులు వచ్చారు. ఆంజనేయులు కళ్లల్లో ఏదో మెరుపు!

"మీ కోసం ఎదురుచూస్తున్నాను" అన్నాడు ఆంజనేయులు.

ఆంజనేయులు మాటలతో యమభటులు షాక్ తిన్నారు. తమని చూసి హడలిచావాలి. అట్లాంటిది పోయి మీకోసమే ఎదురుచూస్తున్నానంటున్నాడు. యమభటులకు ఇది మింగుడుపడలేదు.

"ఎదురుచూస్తున్నావా? ఎందుకూ?" అడిగారు వాళ్లు ముక్తకంఠంతో.

"ఇంకెందుకు. చావడానికి" అన్నాడు స్థిరంగా.

యమభటులు బిక్కమొగాలు పెట్టి ఒకరినొకరు చూసుకున్నారు.

"చావంటే నీకు భయంలేదా" అడిగాడొక యమభటుడు.

"చావంటే భయమెందుకు. నిద్రపోడానికి భయపడతామా! చావంటే దీర్ఘనిద్రే కదా! ఈ దీర్ఘనిద్రకోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. వెనుక వచ్చినవాళ్లు వెళ్లుచుండ నన్నేల పంపకుందువు శ్రీగండి ఆంజనేయా! అంటూ నా ఇష్టదైవాన్ని వేడుకుంటూనే వున్నాను. ఇన్నాళ్లకు ఆయనకు నామీద దయకలిగింది. మీరు వచ్చినారు." అన్నాడు గడగడ ఆంజనేయులు.

అతని మాటలు వింటూంటే యమభటులకు ఆశ్చర్యంకలిగింది. ఇన్నాళ్లా ప్రాణం మీది తీపితోచావంటే భయపడే వాళ్లనే చూచారు. ఇంతగా చావుకి మొగంవాచినవాళ్లని చూడలేదు. అతని ధోరణి వాళ్లకు నచ్చినట్లులేదు.

"చావంటే దీర్ఘనిద్ర అనుకొని చంకలెగరవేస్తున్నావు. మాలోకంలో నువ్వనుభవించవలసిన నరకయాతన గురించి నీకు తెలిసినట్లు లేదు." అన్నాడొక యమభటుడు.

సమాధానం చెప్పడానికి ఆంజనేయులు తటపటాయించలేదు. తడబాటూ పడలేదు.

"పదిమందితో చావు పెళ్లితోసమానమంటారు. మీ లోకంలో నలుగురితో బాటూ నేనూ నరకయాతన అనుభవిస్తాను. ఇక్కడ దరిద్రం మీ నరకయాతనకన్నా దారుణంగా వుంటుందని మీకు తెలిసినట్లులేదు" అన్నాడు ఆంజనేయులు.

"ఏం పనిచేస్తావు?" అడిగాడు ఒక యమభటుడు ఆసక్తిగా.

ఆంజనేయులుకు చిరాకు కలిగింది. ఈ చచ్చుప్రశ్నలతో ఎందుకు వృధా కాలయాపన చేస్తున్నారో అతనికి చచ్చినా బోధపడలేదు. అయిష్టంగానే సమాధానం చెప్పాడు.

"అరకపట్టి వ్యవసాయం చేస్తాను. సన్నకారు రైతుని. మంచితనాన్ని అమ్ముకోకుండా కష్టాన్ని నమ్ముకొని బతుకుతున్నవాన్ని."

"అది సరే. జీవితం మీద విరక్తి ఎందుకు?"

ఎందుకు అంటే ఏంచెప్పగలడు ఆంజనేయులు! ఆరుగాలం కష్టించి పనిచేయడానికి కావలసిన కండబలం వుంది. జీవనపోరాటం చేయడానికి కావలసింది కండబలం మాత్రమే కాదు. స్వేచ్ఛ వుండాలి. తన కష్టఫలం తనకే దక్కాలి. అవి రెండూ తనకు లేవు. అందుకే బ్యాంకుల్లో అప్పులు- షాహుకార్ల దగ్గర అప్పులు- వూరినిండా చేబదుళ్లు. అంతాకలసి ఇనుపముక్కు కాకుల్లా పొడుస్తున్నారు. ఎద్దుపుండు కాకికేం ముద్దు. ఆలోచించి ఆలోచించి మొదట్లో నరాలు చిట్లిపోతాయేమోననిపిస్తుంది.

జీవితం మీద విరక్తి ఎందుకు అంటే ఏం చెప్పగలడు?

ఆంజనేయులు మౌనం వహించాడు.

"పలకవేం?" అన్నారు యమభటులు.

తాపీగా ప్రశ్నలడుగుతున్న యమభటులమీద ఆంజనేయులుకు పట్టరాని ఆగ్రహం కలిగింది.

"అయ్యా నన్ను త్వరగా తీసుకుపోండి." అంటూ ఒక గావుకేక వేశాడు.

కల చెదిరిపోయింది.

కళ్లు తెరిచి తన చుట్టూ చూశాడు. భార్యాబిడ్డల మొగం చూచాడు. వాళ్ల కళ్లల్లో మెరుపు.

"నాన్నా పీడకల వచ్చిందా?" కొడుకు సమీర్ అడిగాడు.

"కాదురా నాయనా. తీయటికలే. చెదిరిపోయింది. ఇక మళ్లీ పీడకలలు ఆరంభమవుతాయి" అన్నాడు నీరసంగా నిస్సత్తువగా.

"నాన్నా నువ్వు మూడురోజుల కోమా నుంచీ బయటపడ్డావు. ఇక భయంలేదు నాన్నా. నువ్వు మృత్యువుని జయించినావు." అన్నాడు సమీర్ సంతోషంగా.

జయించాడో, ఓడిపోయాడో అర్థంగాక నీరసంగా కళ్లు మూసుకున్నాడు ఆంజనేయులు. ●

## అవసరమైనంతమేరకు వస్త్రధారణ: కాశ్మీరా షా

ఇటీవల వెండితెరపైకి వచ్చిన తార కాశ్మీరా షా. బాలీవుడ్‌లో తన అందచందాలతో, కవ్వించే నటనతో ఆకట్టుకుంటుంది. అయితే ఎక్స్‌పోజింగ్ పట్ల తనకు ఆసక్తి లేదని చెబుతోందామె. కాని పాత్రలకనుగుణంగా వస్త్రధారణ ఉండాలన్న విషయంలో తనకు పట్టింపు లేదంటోంది. ఎక్స్‌పోజింగ్ కోసమే ఎక్స్‌పోజింగ్ అన్న సూత్రం మంచిది కాదని, కాని ఒక పరిస్థితిలో, పాత్రలో, ఆ సన్నివేశంలో అవసరమైనంతమేరకు డ్రెస్సులు ధరించాలంటే అది తప్పనిసరి అంశమన్న విషయంతో ఆమెకు పేచీలేదు. అందువల్లనే కావచ్చు, కాశ్మీరా షాను తమ సినిమాల్లోకి తీసుకోవడం పట్ల నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే తీర్చిదిద్దిన అందంతో ఆకట్టుకునే కాశ్మీరా షా ఫీల్డులో నెగ్గుకు రావడానికి అవకాశాలున్నాయని చెప్పుకుంటున్నారు. వారసత్వంతో వచ్చిన హీరోయిన్‌లున్నా, తన అందమే తనకు పెద్ద ఎసెట్ అన్న ధీమా కాశ్మీరా కళ్ళల్లో కనిపిస్తుంది.

